## హైదరాబాద్‌లో ఐకామ్ ఆయుధాల ఉత్పత్తి

హైదరాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో ఒప్పందాలు చేసుకున్న పరిశ్రమలు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. తాజాగా మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) గ్రూప్‌నకు చెందిన ఐకామ్ సోమవారం ప్రారంభించింది. హైదరాబాద్‌లోని నాగారంలోని ఐకామ్ సమీకృత ఇంజనీరింగ్ విభాగం ఆవరణలో ఈ ఆయుధ తయారీ కేంద్రాన్ని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ పాతూరు, క్యారకల్ సీఈవో హమద్ అల్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ.. ఈ కర్మాగారం భారతదేశ రక్షణ దళాలకు తమ తిరుగులేని నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. ఐకామ్‌లో దేశంతో పాటు ప్రపంచానికి ఉపయోగపడే విధంగా ఆయుధాలను తయారు చేస్తున్నామన్నారు.

## కీలక రంగాల్లో నిస్తేజం

### మార్చి నెలలో 3.8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: గత కొన్ని నెలలుగా ఆశాజనక పనితీరు కనబరిచిన కీలక రంగాల్లో మళ్లీ నిస్తేజం ఆవరించింది. మార్చి నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 3.8 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 6.3 శాతంతో పోలిస్తే సగానికి సగం తగ్గింది. కానీ, వరుస నెల ఫిబ్రవరిలో నమోదైన 3.4 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. గత నెలలో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం వల్లనే కీలక రంగాలు నెమ్మదించాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. మరోవైపు, గత నెలలో బొగ్గు 1.6 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు 0.2 శాతం, స్టీల్ 7.1 శాతం, విద్యుత్ 6.2 శాతం చొప్పున పనితీరు కనబరిచాయి. దీంతోపాటు ఎరువులు ఉత్పత్తిలో 8.8 శాతం, సిమెంట్ 11.6 శాతం చొప్పున అత్యధిక వృద్ధిని నమోదుచేసుకున్నాయి. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి కీలక రంగాలు 4.4 శాతం వృద్ధిని మాత్రమే కనబరిచాయి.

## ఇంటర్ ఫలితాలు నేడే

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేస్తారు. tgbie.cgg.gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, సమాచారం కోసం 924 02 55555 నంబర్, helpdesk-ie@telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య తెలిపారు. ఫలితాలు 'నమస్తే తెలంగాణ' వెబ్‌సైట్‌లోనూ లభ్యమవుతాయి.

## నేడు ఎప్‌సెట్ హాల్ టికెట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం హాల్ టికెట్లు మంగళవారం ఉదయం వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. 19న అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగం హాల్‌టికెట్లను విడుదల చేశారు. ఎప్‌సెట్ పరీక్షలను ఈ నెల 29 నుంచి మే 4 వరకు నిర్వహించనున్నారు. రూ. 5వేల ఆలస్య రుసుముతో దరఖాస్తు గడువు ఈ నెల 24తో ముగియనున్నది.

## కేజీబీవీ విద్యార్థిని మృతి

గుడిహత్నూర్, ఏప్రిల్ 22 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం తోషంకు చెందిన బోరేకర్ సౌజన్య(13) నేరడిగొండ మండలంలోని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతున్నది. సౌజన్య కొన్ని రోజులుగా రక్తహీనతతో బాధపడుతున్నది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వాంతులు, విరేచనాలు కావడంతో ప్రిన్సిపాల్ రజిత కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఎవరూ రాకపోవడంతో అదేరోజు రాత్రి కేజీబీవీ సిబ్బంది జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

## రేపటి నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : జేఈఈ అడ్వాన్స్‌డ్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభంకానున్నది. విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. మే 5వ తేదీ రాత్రి వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 18న నిర్వహించనున్నారు. ఈ సారి 2,50,236 మంది జేఈఈ మెయిన్‌లో క్వాలిఫై కాగా, వీరు మాత్రమే అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

## ఏఐని బాధ్యతతో వాడాలి

### సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : మానవ జీవితాన్ని కృత్రిమ మేధ(ఏఐ) ప్రభావితం చేస్తున్నదని, ఏఐని బాధ్యతతో వాడాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ సూచించారు. ఈ సాంకేతిక విప్లవంపై వ్యతిరేక ధోరణి మాని, సమర్థవంతంగా బాధ్యతతో వినియోగించుకోవడంపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్సీఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐ కొత్తదేంకాని.. ఎప్పటి నుంచో ప్రభావం చూపుతున్నదేనని అన్నారు. సింగరేణి సంస్థలోనూ టెక్నాలజీ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

# తులం రూ. 1,00,000!

### దేశీయ మార్కెట్‌లో సరికొత్త స్థాయికి బంగారం ధరలు

### 24 క్యారెట్ 10 గ్రాములు రూ.99,800గా నమోదు

### దేశ, విదేశీ ప్రతికూలతలతో రేట్లు పరుగులు

### అంతర్జాతీయంగా 3,397 డాలర్లు పలికిన ఔన్స్



*పసిడి ధరల పరుగు ఆగేలా లేదు. ఇలాగే ఉంటే ఇత్తడిని చూసే పుత్తడి అని మురిసిపోవాలేమో.*

> **సంపన్నులకే దడ పుట్టించేలా ప్రస్తుతం బంగారం రేట్లు పెరుగుతూపోతున్నాయి. ఇక సామాన్యుల సంగతి చెప్పనే అక్కర్లేదు.**

*లక్ష రూపాయల మార్కుకు కూతవేటు దూరంలో తులం విలువ పలుకుతున్నది మరి. ఢిల్లీలో 24 క్యారెట్ 10 గ్రాములు ఆల్ టైమ్ హైని తాకుతూ రూ.99,800గా నమోదైంది.*

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: గతకొంత కాలంగా తులం బంగారం ధర లక్ష రూపాయలకు చేరబోతున్నదంటూ వినిపించిన అంచనాలు నిజమయ్యాయి. దేశీయ మార్కెట్‌లో సోమవారం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.1,650 ఎగిసి లక్ష రూపాయల సైకలాజికల్ మార్కుకు చేరువై ఏకంగా రూ.99,800 పలికింది. దీంతో ఇక టార్గెట్ రూ.1.50 లక్షలుగా మారింది. అయినా గోల్డ్ రేట్ల దూకుడును చూస్తుంటే ఈ రికార్డు ఎంతో దూరంలో లేదనిపిస్తున్నదిప్పుడు. పసిడి ధరలకు ఆకాశమే హద్దైంది మరి. దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితుల నడుమ రోజుకో రికార్డును సృష్టిస్తున్నాయి. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తులం రేటు రూ.20,850 పెరగడం గమనార్హం.

**ఇదీ సంగతి..**

కరెన్సీ మార్కెట్‌లో అమెరికన్ డాలర్ బలహీనపడటం, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటం.. గోల్డ్ మార్కెట్‌ను షేక్ చేస్తున్నది. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు నెలకొనడంతో మదుపరులు తమ పెట్టుబడులను పసిడి వైపునకు మళ్లిస్తున్నారు. ఇక బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలతో కొనుగోలుదారుల నుంచి పెద్దగా గిరాకీ లేకున్నా.. జ్యుయెల్లర్స్, రిటైలర్స్ నుంచి డిమాండ్ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే మార్కెట్‌లో పుత్తడి ధరలు దౌడు తీస్తున్నాయని మెజారిటీ నిపుణుల విశ్లేషణ. కాగా, అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం చైనా మినహా మిగతా దేశాలపై ఆగినా.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మాత్రం ఆ సెగ తగులుతూనే ఉన్నది. ఈ క్రమంలో ఆయా దేశాలతో జరుగుతున్న అమెరికా ట్రేడ్ డీల్స్‌నుబట్టి భవిష్యత్తులో బంగారం రేట్ల పెరుగుదలలో వేగం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లోనూ బంగారం రేట్లు పరుగులు పెడుతున్నాయి. 24 క్యారెట్ తులం రూ.770 పుంజుకొని రూ.98,350గా నమోదైంది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) రూ.700 పెరిగి రూ.90,150గా ఉన్నది. ఇక ఢిల్లీలో కిలో వెండి ధర రూ.98,500గా ఉన్నది. ఇదిలావుంటే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో జూన్ డెలివరీకిగాను ఫ్యూచర్స్ ఇండెక్స్‌లో గోల్డ్ 10 గ్రాముల 96,875గా నమోదైంది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ విలువ తొలిసారి 3,397.18 డాలర్లకు చేరింది.

# వివాదాస్పదం

### మారుబేనీపై పలు దేశాల్లో లంచాల కేసులు!

### భారత్‌లో సొంతంగా ఒక్క ప్రాజెక్టూ చేపట్టని సంస్థ

### భాగస్వామ్య కంపెనీలతోనే వ్యాపారం

### ఆర్థికంగా బలహీనమే • అయినా ప్రభుత్వం ఒప్పందం

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బృందం జపాన్ పర్యటనలో చేసుకుంటున్న పెట్టుబడి ఒప్పందాలన్నీ డొల్ల కంపెనీలతోనేనా? అంటే అవుననే సమాధానం వస్తున్నది. తెలంగాణ ప్రభుత్వంతో రూ.5,700 కోట్ల పెట్టుబడి ఒప్పందం చేసుకున్న ఉర్సా కంపెనీకి ఎక్కడా ఊరు.. పేరు.. లేదని వెల్లడైన మరునాడే మరో కంపెనీ బాగోతం బట్టబయలైంది. రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం చేసుకున్న మారుబేనీ కంపెనీ సైతం అత్యంత వివాదాస్పద కంపెనీ అని తేలింది. నైజీరియా, ఇండోనేషియాల్లో లంచాల కేసులు నమోదవగా, జరిమానాలు చెల్లించి బయటపడింది. రూ.1,000 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు 2 రోజుల క్రితమే మారుబేని ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే. అంతేకాదు అందులో దాదాపు రూ.5,000 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 30 వేల ఉద్యోగాలు లభిస్తాయని కూడా ప్రకటించారు. కాగా, సదరు కంపెనీపై పలు దేశాల్లో అనేక అవినీతి ఆరోపణలున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మారుబేనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనేది మారుబేనీ కార్పొరేషన్ (జపాన్) అనుబంధ సంస్థ. సదరు కంపెనీకి లంచాల కేసులో అమెరికా న్యాయ శాఖ గతంలో 88 మిలియన్ డాలర్ల జరిమానా విధించినట్టు తెలిసింది. నైజీరియాలోని బోనీ ఐలాండ్‌లో గ్యాస్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన కాంట్రాక్టును దక్కించుకునేందుకు టీఎస్‌కేజీ కంపెనీ ద్వారా అక్కడి అధికారులకు లంచం ఇచ్చినట్టు నైజీరియా ప్రభుత్వం గుర్తించింది. దీంతో 54.6 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించి కేసు పరిష్కరించుకున్నది. కంపెనీపై యుఎస్ ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ) కింద కేసు కూడా నమోదైంది. అంతేగాక ఇండోనేషియాలో విద్యుత్తు సేవలు (పవర్ సర్వీసెస్) సమకూర్చేందుకు ఉద్దేశించిన 118 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును దక్కించుకునేందుకు అక్కడి పార్లమెంటు సభ్యులతోపాటు అధికారులకు లంచం ఇచ్చిన వ్యవహారంలో మారుబేనీపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో 8 క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలడంతో యూఎస్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ 88 మిలియన్ల జరిమానా విధించింది. అలాగే మారుబేనీ భారత్‌లో ఇంతవరకు ఒక్క కంపెనీ కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.



ఒప్పందం సందర్భంగా మారుబేని ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి (ఫైల్)

**భారత్‌లో ఒక్క కంపెనీ ఉంటే ఒట్టు..**

మారుబేనీ కంపెనీ 2022-23లో ప్రకటించిన ప్రకారం నిర్వహణ ఆదాయం రూ. 100-500 కోట్లే. అలాగే కంపెనీ ట్రాక్ రికార్డు చూసుకుంటే.. 1996 నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నప్పటికీ ఇంతవరకు చెప్పుకోదగ్గ ఒక్క కంపెనీని కూడా భారత్‌లో సదరు సంస్థ ఏర్పాటు చేయలేదు. అనేక కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ వాటిల్లో చాలా కంపెనీలు ఆలస్యం కావడమో, లేక అసలు స్థాపించకపోవడమో జరిగింది. మన రాష్ట్రంలో రూ.1,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నప్పటికీ నిధులు ఎలా సమకూర్చుకుంటుందనేది ఎక్కడా వెల్లడించలేదు. ఇది ఎక్కువగా కేపీడీఎల్ భాగస్వామ్య కంపెనీ భాగస్వామ్యంతోనే పెట్టుబడులు పెడుతుండటం కూడా అనుమానాలను రేకెత్తిస్తున్నది. మారుబేనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇంతవరకు స్వతంత్రంగా వెబ్‌సైట్‌ను నిర్వహించడంగానీ, సీఎస్‌ఆర్ వివరాలు వెల్లడించడంగానీ జరగలేదు. కంపెనీ ఆర్థిక వివరాలు, ఉద్యోగుల సమాచారం కూడా తెలియరాదు. దీంతో కంపెనీపై అనుమానాలకు తావిస్తున్నది.



**వివాదాస్పద కంపెనీతో ఒప్పందమేమిటి?**

*అనేక దేశాల్లో లంచాల కేసులున్న వివాదాస్పద మారుబేనీ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం ఏమిటి? మారుబేనీ కంపెనీపై నైజీరియా, ఇండోనేషియా దేశాల్లో లంచాల కేసులు ఉన్నట్టు తేలింది. ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునే ముందు కంపెనీల ట్రాక్ రికార్డు పరిశీలించాలి. ఊరూ.. పేరు.. లేని ఉర్సా కంపెనీ తరహాలోనే మారుబేనీ కూడా ఉన్నది.*

*-సతీష్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు*

# అనుమానాలెన్నో!



### రూ.27వేల కోట్లతో ఎకోరెన్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంవోయూ

### బాబు డైరెక్షన్‌లో ఈ సంస్థ తెలంగాణకు వచ్చినట్టు ప్రచారం

### ఎకోరెన్ ప్రమోటర్ లక్ష్మీప్రసాద్ లింగమనేని సమీప బంధువు

### ఈ సంస్థకు అంత సీనుందా..? లేక షెల్ కంపెనీయా అన్న డౌట్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవల కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎకోరెన్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఏకంగా రూ.27 వేల కోట్ల పెట్టుబడుల పెట్టేందుకు ముందుకొచ్చింది. అసలీ ఈ కంపెనీ తెలంగాణకు ఎలా వచ్చింది? ఇంతటి భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టే సత్తావున్నదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ సంబంధాలతో అడుగుపెట్టిందా..? లేక నిజంగానే ఈ కంపెనీకు అంత ఆర్థిక సత్తా ఉందా? ఇదేమైనా డొల్ల కంపెనీయా..? అని విద్యుత్తు రంగ నిపుణులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవలే ఎకోరెన్ ఇండియా ఎనర్జీ లిమిటెడ్.. టీజీ రెడ్‌కోతో ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 3,279 మెగావాట్ల విండ్ - సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్ట్‌తోపాటు 1,650 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్స్, 650 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

**బాబు డైరెక్షన్‌లోనేనా.**

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరగానే ఎకోరెన్ ఎనర్జీ సంస్థ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు జెట్ స్పీడ్‌తో ఆగమేఘాల మీద అనుమతులొచ్చాయి. శ్రీ సత్యసాయి అనంతపురం జిల్లాల్లో రూ.1,600 కోట్లకు పైగా పెట్టుబడులకు ఏపీ సర్కారు గ్రీన్ సిగ్నలిచ్చింది. ఈ కంపెనీ ప్రమోటర్ అయిన యెర్నేని లక్ష్మీప్రసాద్ డైరెక్టర్‌గా ఉన్న అనంతపూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు కూడా ప్రభుత్వం రూ.970 కోట్ల పెట్టుబడులకు రెడ్ కార్పెట్ పరిచింది. ఆ వెంటనే ఇదే సంస్థ రూ.27వేల కోట్లను పెట్టుబడి పెడతామని తెలంగాణకు వచ్చింది. వాస్తవానికి ఈ సంస్థ 2010లో ఏర్పాటైనట్టు తెలుస్తున్నది. ఇంత తక్కువ వ్యవధిలో అంత టర్నోవర్ ఎలా సాధించిందన్న దానిపై అనుమానాలొస్తున్నాయి. ఎకోరెన్ అనుబంధ సంస్థ అయిన బోరియాస్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మధ్య తలెత్తిన వివాదం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వద్దకు చేరింది. కర్ణాటకలోని బళ్లారిలో 175 మెగావాట్ల పవన విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటుచేసిన సంస్థ రూ.2.77కు యూనిట్ చొప్పున సరఫరా చేస్తామన్నది. 2020 డిసెంబర్ వరకు పూర్తిచేయాల్సి ఉండగా, నిర్మాణం పూర్తికాలేదు. దీంతో వివాదానికి దారితీసింది.

**పొలిటికల్ లింకుతోనేనా..**

ఎకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ వ్యవస్థాపకులైన యెర్నేని లక్ష్మీప్రసాద్ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన లింగమనేని రమేశ్‌కు సమీప బంధువుట. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబుకున్న పొలిటికల్ లింకులతోనే ఎకోరెన్ తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నదా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అంటే బాబు డైరెక్షన్‌లోనే ఈ కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెడుతున్నట్టు, తెలంగాణ సర్కారు బాబు డైరెక్షన్‌లోనే అనుమతులిచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటీవలి కాలంలో కొందరు రాజకీయ నేతలు తమ అవినీతి సొమ్మును కంపెనీల పేరుతో తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవలే ఉర్సా క్లస్టర్స్ పెట్టుబడుల వ్యవహారం అటు ఏపీలో ఇటు తెలంగాణలో దుమారం రేపుతున్న తరుణంలో అందరి దృష్టి ఎకోరెన్ కంపెనీపై పడింది. ఈ కంపెనీకి అంత పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టే సత్తా ఉందా.. లేక ఈ 27వేల కోట్ల పెట్టుబడుల తెర వెనుక ఎవరైనా ఉన్నారా అన్న చర్చలు నడుస్తున్నాయి.



**అన్ని పరిశీలించే ఎంవోయూ కుదుర్చుకున్నాం**

*ఎకోరెన్ సంస్థ గత చరిత్ర, టర్నోవర్‌లను పరిశీలించే ఎంఓయూ కుదుర్చుకున్నాం. అన్ని కోణాల్లో పరిశీలించాం. ఈ కంపెనీలకు కొత్తగా ఎలాంటి రాయితీలివ్వడం లేదు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో ప్రకటించిన రాయితీలే వర్తిస్తాయి. స్థలాలను ఆయా కంపెనీలే సేకరించుకోవాలి. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నీటిపారుదల శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.*

*- అనీల వావిల్ల, వీసీ, ఎండ్ ఎండీ టీజీ రెడ్‌కో*




## 'అనురాగ్, అరిజోనా' ఎంవోయూ

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : అమెరికాకు చెందిన అరిజోనా స్టేట్ వర్సిటీతో రాష్ట్రంలోని అనురాగ్ వర్సిటీ ఎంవోయూ కుదుర్చుకున్నది. సోమవారం హైదరాబాద్‌లో అనురాగ్ వర్సిటీ చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అరిజోనా వర్సిటీ సీనియర్ డైరెక్టర్ క్రిస్ జాన్సన్ పాల్గొన్నారు. విద్యార్థులు తొలుత అనురాగ్ వర్సిటీలోని ఇంటర్నేషనల్ కాలేజీలో చదువును ప్రారంభిస్తారు. ఆ తర్వాత అమెరికాకు వెళ్లి డిగ్రీ కోర్సు పూర్తిచేస్తారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ ఈ ఒప్పందం తక్కువ ఖర్చుతో, అంతర్జాతీయ విద్యను అందించాలన్న తమ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## వారంలో 'దోస్త్' నోటిఫికేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు నిర్వహించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) నోటిఫికేషన్ వారంలో విడుదలకానున్నది. అధికారిక సమాచారం మేరకు ఈ నెల 28న విడుదలకానున్నది. ఇంటర్ ఫలితాలు మంగళవారం విడుదలకానున్న నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరంలో డిగ్రీ ఫస్టియర్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలపై అధికారులు దృష్టిసారించారు. దోస్త్ కన్వీనర్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి వ్యవహరించనున్నారు.

## వేసవిలో టీచర్ల బదిలీలు చేపట్టండి: తపస్

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : వేసవి సెలవుల్లో టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణాను సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతుల్లో సీనియార్టీ జాబితాల్లో సాంకేతిక సమస్యల కారణంగా కొందరికి ప్రమోషన్లు దక్కలేదని, వీరికి ఉద్యోగోన్నతులు కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు.

## పొద్దున పట్టుకుంటే.. రాత్రి పరారీ!

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో ఏడుగురు సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసుల కండ్లుగప్పి ఓ సైబర్ నేరస్థుడు తప్పించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీ కేంద్రంగా అమాయకులను మోసం చేస్తున్న దినేశ్‌కుమార్ అనే సైబర్ నేరస్థుడి వివరాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలుసుకున్నారు. అతడిని అరెస్ట్ చేయడానికి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ఏడుగురి బృందాన్ని పంపగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రాత్రి తెలంగాణ భవన్‌కు తీసుకురాగా, పోలీసుల కండ్లుగప్పి తప్పించుకున్నాడు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసి.. గాలింపు చర్యలు చేపట్టారు. సైబర్ నేరస్థుడిని రాత్రి ఎందుకు ఉంచుకోవాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో వివరణ కోరారు. ఢిల్లీ, యూపీ, హర్యానాల్లో అరెస్ట్ చేసిన సైబర్ నేరస్థులను తెలంగాణ భవన్‌లో తమకు కేటాయించిన రూముల్లోకి తీసుకెళ్తున్నారు. నిరుడు ఓ సైబర్ నేరస్థుడిని అరెస్టు చేయగా.. అతడు 4వ ఫ్లోర్ నుంచి దూకి పరారయ్యేందుకు ప్రయత్నించి గాయపడ్డాడు. ఢిల్లీలో పట్టుకునే నేరస్థులను తెలంగాణ భవన్‌కు తీసుకురావడంపై పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


# బీటెక్ సీట్లలో కోతలు.. ఫీజు మిగులు

- రీయింబర్స్‌మెంట్ మిగుల్చుకునేందుకు సర్కారు కొత్త ఎత్తుగడ
- ఇప్పటికే 8వేల కోట్ల ఫీజు బకాయిలు
- ఈ క్రమంలోనే సీట్ల పెంపునకు అనాసక్తి

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ భారాన్ని తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎత్తుగడ వేసినట్టు తెలుస్తున్నది. దీనిపై ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో బీటెక్ కన్వీనర్ కోటా సీట్ల పెంపునకు సర్కారు అదిలోనే బ్రేకులు వేసినట్టు సమాచారం. బీటెక్‌లో ప్రస్తుతం 87,184 సీట్లు కన్వీనర్ కోటాలో ఉన్నాయి. కొత్తగా రెండు ఇంజినీరింగ్ కాలేజీలు మంజూరయ్యాయి. శాతవాహన, పాలమూరు యూనివర్సిటీల్లో కొత్తగా ఇంజినీరింగ్ కాలేజీలను ప్రారంభించనున్నారు. వీటిల్లో మూడు, నాలుగు బ్రాంచీలనే ప్రారంభించనున్నారు. ఒక్కో బ్రాంచీలో 60 సీట్లు మాత్రమే ఉండటంతో సీట్ల సంఖ్య పెద్దగా పెరిగే అవకాశాల్లేవు. ఇక కొత్తగూడెంలోని మైనింగ్ కాలేజీని ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసినా దీంట్లో కొత్త కోర్సులేవీ లేవు.

**భారాన్ని తగ్గించుకునేందుకేనా?**

రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికే సర్కారు పాలిట గుదిబండగా మారాయి. దాదాపు 8వేల కోట్ల బకాయిలున్నట్టు కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ రెండేండ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇక కొత్తగా సీట్ల పెంపునకు అనుమతిస్తే ఆయా సీట్లకు సర్కారు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. 10వేల లోపు ర్యాంకు పొందిన అందరు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు ర్యాంక్‌తో సంబంధం లేకుండా కాలేజీల్లో ఫీజు ఎంతుంటే అంత మొత్తాన్ని ప్రభుత్వం రీయింబర్స్ చేయాల్సి ఉంది. ఇక బీసీ విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ. 35వేలు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా ఇవ్వాలి. ఈ పరిస్థితుల్లో కొత్త సీట్లు ఇచ్చుకుంటూ పోతే ఫీజు రీయింబర్స్‌మెంట్ భారంగా మారుతుందన్న భయం సర్కారును పట్టిపీడిస్తున్నది. దీంతో సీట్ల పెంపునకు సర్కారు ఆసక్తి చూపడం లేదని సమాచారం.



**కనీసం పాత సీట్లైనా ఇవ్వండి..**

2024 -25 విద్యాసంవత్సరంలో కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు కోర్సుల కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం అనుమతించలేదు. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. కోర్టు మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని తీర్పునిచ్చినా ప్రభుత్వం మొండికేసింది. ఫలితంగా 6 వేల సీట్లకు కోత పడింది. కోర్టు తీర్పు ఆసరాగా చేసుకున్న కొన్ని కాలేజీలు సొంతంగా సీట్లు నింపుకున్నాయి. ఈ 6వేల సీట్లల్లో కేవలం 400 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఆ 6వేల సీట్లను ఈ సారైనా ఇవ్వాలంటూ కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## ఫీజు బకాయిలు త్వరగా చెల్లించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం త్వరగా చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిధుల విడుదల కోసం 29న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడించాలని విద్యార్థులకు, బీసీ సంఘాలకు పిలుపు ఇచ్చారు. బీసీ విద్యార్థులతో ఆయన సోమవారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బకాయిలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16, 75,000 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఫీజులు చెల్లించాల్సి ఉందని, రూ. 4వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తున్న సర్కారు విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు బడ్జెట్ లేదని చెబుతుండడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చదువుకోకుండా చేసే కుట్రలో భాగమేనని ధ్వజమెత్తారు. ఫీజుల బకాయిల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. 29న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలు ముట్టడించాలని ఆర్ కృష్ణయ్య పిలుపు ఇచ్చారు.

## 24 ఏండ్ల యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

### ప్రాణం కాపాడిన మల్లారెడ్డి నారాయణ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 21,(నమస్తే తెలంగాణ): క్యాన్సర్‌తో బాధపడుతున్న 24 ఏండ్ల యువకుడికి సూరారం మల్లారెడ్డి నారాయణ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. 24 ఏండ్ల గౌతమ్ కుమార్ క్యాన్సర్‌తో బాధపడుతూ.. రెండు లైన్ల కీమోథెరపీ చికిత్స చేయించుకుని మల్లారెడ్డి నారాయణ క్యాన్సర్ హాస్పిటల్‌కు వచ్చాడు. గౌతమ్‌ను పరీక్షించిన వైద్యులు ప్రైమరీ పెరిటోనియల్ ఎవింగ్స్ సార్కోమాతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వెంటనే సర్జికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ హరీశ్ నేతృత్వంలోని మల్టీడిసిప్లినరీ ఆంకాలజీ బృందం 16గంటలపాటు హెచ్‌ఐపీఈసీ శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణాలు కాపాడారు. సంప్రదాయ చికిత్సా పద్ధతులు విఫలమైన సందర్భాల్లో.. ఈ శస్త్ర చికిత్స ద్వారా రోగులకు దీర్ఘకాలిక మనుగడకు అవకాశం లభిస్తుందని డాక్టర్ హరీశ్ ఈ సందర్భంగా తెలిపారు.

## మన కర్మాగారాలు ఎంతో బెటర్!

- డైరెక్టర్ బీ రాజగోపాల్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): తెలంగాణలోని కర్మాగారాల్లో జరిగే అగ్నిప్రమాద మరణాలు, షాపింగ్ మాల్స్ సహ ఇతర చోట్ల జరిగే అగ్నిప్రమాద మరణాల కన్నా తక్కువేనని రాష్ట్ర ఫ్యాక్టరీల డైరెక్టర్ రాజగోపాల్‌రావు పేర్కొన్నారు. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం కర్మాగారాల్లో అగ్నిప్రమాదాల నివారణపై ఎఫ్‌టీసీసీఐలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో రాజగోపాల్‌రావు మాట్లాడారు. నివాస ప్రాంతాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, సినిమా థియేటర్లు, షాపింగ్‌మాల్స్, కోచింగ్ సెంటర్లు, స్కూళ్లు, దవాఖానలు, కార్యాలయాలు, ఫంక్షన్ హాళ్లు సహ అనేక ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఫ్యాక్టరీల్లో మాత్రం మరణాల సంఖ్య తక్కువగా నమోదవుతున్నట్టు గుర్తించామని వెల్లడించారు. ఆయిల్, పేలుడు పదార్థాల తయారీ, ఫార్మా, కెమికల్ పరిశ్రమలకు తెలంగాణ కేంద్రంగా ఉన్నప్పటికీ ప్రమాదాలు చాలా తక్కువగా నమోదవుతున్నాయని పేర్కొన్నారు. ప్లానింగ్, డిజైన్, , అగ్నిప్రమాదాల నివారణపై సరైన శిక్షణ ద్వారా వీటిని నివారించవచ్చని తెలిపారు. గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవడం, బయటకు వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు, సమీప ఫ్యాక్టరీలతో పరస్పర సహకారం తదితర చర్యలు కూడా ప్రమాదాల నివారణకు ఎంతో అవసరమని గోపాలరావు వివరించారు.

## డిగ్రీలో మళ్లీ 'బకెట్' విధానం

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ కోర్సుల్లో 'బకెట్' విధానాన్ని మళ్లీ పునరుద్ధరించాలని సర్కారు నిర్ణయించింది. ఇటీవలే బకెట్ సిస్టంను రద్దుచేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించగా, ఈ ప్రతిపాదనలను సర్కారు తిరస్కరించింది. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ 'దోస్త్'నోటిఫికేషన్ విడుదలపై విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఎస్కే మహమూద్, ఇటికాల పురుషోత్తం, ఆరు వర్సిటీల వీసీలు హాజరయ్యారు. బకెట్ సిస్టం అంశంపై సోమవారం జరిగిన సమావేశంలో చర్చ జరిగింది. అకాడమిక్ మధ్యలో నిర్ణయాలు తీసుకుంటే గందరగోళానికి దారితీస్తుందని అధికారులు హెచ్చరించినట్టు తెలిసింది. లోపాలుంటే సమీక్షించి సరిదిద్దాలి లేదా ఓ కమిటీ వేసి అభిప్రాయాలు తీసుకోవాలే తప్ప ఇలా ఏకపక్షంగా రద్దు నిర్ణయం ప్రకటిస్తే ఎలా..? అంటూ ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ విద్యాసంవత్సరంలో బకెట్ విధానాన్ని కొనసాగించాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణను అమలుచేయాలని, కొన్ని సబ్జెక్టుల పేర్లు మార్చాలని సమావేశంలో ఏకాభిప్రాయానికి వచ్చినట్టు అధికారులు తెలిపారు.